


# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూన్ 22 2025 సంపుటి :0 సంచిక :247 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## యోగాకు సరిహద్దులు లేవు..

# ప్రపంచాన్ని ఏకం చేసింది



యోగాకు సరిహద్దులు లేవని, ప్రపంచాన్ని ఏకం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. శనివారం (జూన్ 21) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం లో నిర్వహిస్తున్న యోగాంధ్ర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ లోని ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు లక్షల మందితో ఏర్పాటు చేసిన యోగా వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

యోగా ను ప్రపంయలోని 175 దేశాలు అనుసరిస్తున్నాయని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. యోగా గ్లోబలైజ్ కావడం సామాన్యమైన విషయం కాదన్నారు. యోగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన శైలిని మార్చిందని.. అంతరిక్షంలో కూడా యోగా చేసిన ఘనత మనదేనని అన్నారు.

యోగాకు సరిహద్దుల్లేవని, వయసుతో పనిలేదని.. అది ప్రకృతి, ప్రగతి సంగమమని కొనియాడారు. యోగాంధ్ర ఈవెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏపీ సర్కారుకు అభినందనలు. ప్రజల భాగస్వామ్యానికి ఇదొక స్ఫూర్తిగా నిలిచిందని.. వికసిత్ భారత్ ఆలోచనలకు ఇది రూపమని -ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా

# 8.58లక్షల దరఖాస్తులు



భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఈ సమీక్ష జరిగింది. ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి భూ భారతి చట్టాన్ని ఆవిష్కరించారు.

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా ఇవాళ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరించారు.

వివరాలు 2 లో..

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ

రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి.



02

## 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు

# విదేశీ విద్య



మిగతాది 2లో

## దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతమైంది

### నాడు అన్ని కంపెనీలను సులువుగా అనుమతులు

### దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది : కేటీఆర్



స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసాయుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. పేజి 2లో

## హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా

# ఫోన్‌ట్యాపింగ్



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

02

## ఎన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డికి తలవంచం :



02

## రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ



రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

02

## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు..

# బేడీల రాజ్యం: హరీశ్‌రావు

కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.



02

# అంకెలు ఆమోదించని అచ్చేదిన్



'మోదీ పాలనపై సామాన్యుని సణుగుడు' (జూన్ 14, 'పళని పలుకు') అంకెల్లో ఎలా ప్రతిబింబిస్తుందో చూద్దాం. నిర్దుష్టమైన, నిరూపించదగిన డేటాపై నాకు మక్కువ ఎక్కువ. యదార్థాలను నొక్కి చెప్పేందుకు అంకెలను ప్రస్తావిస్తే చాలా మంది పాఠకులు నొసలు చిట్లించుకోవడం కద్దు. విద్యావంతులు సైతం అంకెలతో కూడిన డేటాను అయిష్టపడతారు. ఒక ఆర్థిక వ్యవస్థ వాస్తవ దృశ్యాన్ని పదాల కంటే అంకెలే సత్యసమ్మతంగా స్పష్టం చేస్తాయని నేను సునిశ్చితంగా విశ్వసిస్తాను.

ప్రజల సంక్షేమమే సుపరిపాలనకు అంతిమ గీటురాయి అయినప్పుడు ఈ ప్రశ్న అనివార్యం: 'ఒక వ్యక్తికి కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్య భద్రత, రవాణా, కుటుంబ వేడుకలు, వినోద విహారాలు ఇత్యాది నిత్యావసరాలకు సరిపడా ఆదాయమున్నదా?' (ఈ రోజుల్లో నిత్యావసరాలుగా భావిస్తున్న ఇతర వ్యయాలను నేను పరిగణనలోకి తీసుకోలేదు). ఈ వ్యయాలపై ప్రామాణికమైన సమాచారం 'గృహ వినియోగ వ్యయ సర్వే' (హెచ్‌సీఈఎస్)లో లభిస్తుంది.

నా దృష్టిలో ఆదాయం కంటే వినియోగ కొలమానా (మెట్రిక్ ఆఫ్ కన్సంప్షన్)లే సగటు కుటుంబ జీవన ప్రమాణాలు, నాణ్యతను నిర్ధారిస్తాయి. చివరి హెచ్‌సీఈఎస్‌ను 2023%–%24లో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 2,61,953 కుటుంబాల (1,54,357 గ్రామీణ, 1,07,596 పట్టణ) నుంచి ఆయా వినియోగ వ్యయాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. కాకతాళీయంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023%–%24లోనే పది సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్నది. హెచ్‌సీఈఎస్ డేటా సమగ్రమైనది. సగటు నెలవారీ తలసరి వినియోగ వ్యయం (ఎమ్‌పీసీఈ) ఆ సర్వేలో కీలకమైనది. ఒక నెలలో ఒక వ్యక్తి వినియోగ వ్యయం ఎంత అనేది అతడి/ఆమె జీవన ప్రమాణాలు, నాణ్యతను వెల్లడిస్తుంది. సదరు వ్యక్తి ధనికుడా, పేదవాడా లేక మధ్యతరగతికి చెందినవాడా అనేది నిర్ధారిస్తుంది. ఎమ్‌పీసీఈ వెల్లడించిన వాస్తవాలను సంగ్రహిస్తాను: ఒక వ్యక్తి చేసే వ్యయాన్ని అతడు/ఆమె ఆదాయానికి, తీసుకున్న రుణానికి ప్రాతినిధ్యంగా తీసుకోవాలి. ఈ ప్రకారం దిగువన ఉన్న పది శాతం మంది దినసరి వ్యయం రూ.50%–%100గా ఉన్నది. కొన్ని ప్రశ్నలు: రోజుకు 50 నుంచి 100 రూపాయల ఖర్చుతో సదరు వ్యక్తి ఎటువంటి ఆహారాన్ని తీసుకుంటాడు? ఎటువంటి నివాసంలో ఉంటాడు? ఎటువంటి వైద్య సేవలు పొందగలుగుతాడు? అవసరమైన ఔషధాలకు ఎంత సొమ్ము భరించగలుగుతాడు?పది శాతం జనాభా అంటే అల్పసంఖ్య కాదు. 14 కోట్ల మందికి సమానం. వారే ఒక ప్రత్యేక దేశంగా ఉంటే జనాభా పరంగా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంటారు. మరి నీతి ఆయోగ్, ప్రభుత్వం మన దేశ జనాభాలో 'పేదలు' కేవలం 5 శాతం, అంతకంటే తక్కువ మంది మాత్రమే ఉన్నారని ఘంటాపథంగా చెబుతున్నాయి. ఈ వాదన క్రూరమైనది, కపటమైనది.సరే, రైతులు, ఆహారానికి సంబంధించిన గణాంకాలు చూద్దాం. ఇవి చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. వ్యవసాయరంగ అభివృద్ధి చాలా ఆరోగ్యదాయకంగా ఉందని ప్రభుత్వం పదే పదే చెబుతోంది. నిజమేనా? మరి రైతన్న జీవితం ఆనందకరంగా ఉన్నదా? నాబార్డ్ డేటా (2021%–%22) ఏమి చెబుతున్నదో చూడండి: దాదాపు 55 శాతం వ్యవసాయ కుటుంబాలు రుణభారంతో కృంగిపోతున్నాయి. వ్యవసాయ కుటుంబాల సగటు రుణ భారం రూ.91,231. ఫిబ్రవరి 3, 2025న ప్రభుత్వం ఇచ్చిన ఒక సమాధానం ప్రకారం 13.08 కోట్ల మంది రైతులు వాణిజ్య బ్యాంకులకు రూ.27,67,346 కోట్లుబీ 3.34 కోట్ల మంది రైతు సహకార బ్యాంకులకు రూ.2,65,419 కోట్లు, 2.31 కోట్ల మంది రైతులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు రూ.3,19,881 కోట్ల మేరకు బకాయిలు చెల్లించవలసి ఉన్నది. ప్రధానమంత్రి కిసాన్ యోజన నుంచి లబ్ధి పొందుతున్న రైతుల సంఖ్య ఒకే విధంగా ఉండడం లేదు. ఏప్రిల్ %–%జూలై 2022లో 10.47 కోట్ల మంది లబ్ధి పొందారు. 2023 (15వ విడత చెల్లింపు)లో ఈ లబ్ధిదారుల సంఖ్య 8.1 కోట్లకు తగ్గింది. ఫిబ్రవరి 2025 (19వ విడత చెల్లింపు)లో ఈ లబ్ధిదారుల సంఖ్య 9.8 కోట్లు అని ప్రభుత్వం చెప్పింది. ఈ లబ్ధిదారుల సంఖ్యలో హెచ్చుతగ్గులకు కారణమేమిటో ప్రభుత్వం చెప్పలేదు. కౌలుదారులు అయిన రైతులు ఈ పథకం నుంచి ఎలాంటి లబ్ధి పొందడం లేదు. కౌలు రైతులను ఉపేక్షించడం సమర్థనీయమేనా? యూపీఏ ప్రభుత్వ పంట బీమా పథకాన్ని మెరుగుపరిచి పునః ప్రవేశపెట్టింది. ప్రైవేట్ బీమా సంస్థలను అనుమతించింది. లాభాలు ఆశించకుండా, నష్టాలు వాటిల్లకుండా (నో ప్రాఫిట్, నో లాస్) ఉండేలా పంట బీమా పథకాలను రూపొందించి అమలుపరచాలని బీమా కంపెనీలను యూపీఏ ప్రభుత్వం ఆదేశించింది. మరి ఎన్డీఏ ప్రభుత్వం అమలుపరిచిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒక దోపిడీ పథకంగా పరిణమించింది. రైతుల క్లెయిమ్‌లకు చెల్లించిన మొత్తం రైతుల నుంచి సేకరించిన మొత్తం ప్రీమియంల సొమ్ములో 2019%–%20లో 87 శాతం నుంచి 2023%–%24లో 56 శాతానికి తగ్గిపోయింది!గ్రామీణ శ్రామిక జనుల సామాజిక భద్రతకు ఆలంబనగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మూడు సంవత్సరాలుగా నిధుల కేటాయింపులు ఎదుగు బొదుగు లేకుండా నిలిచిపోయాయి. కోట్లాది మందిని ఈ పథకం పరిధి నుంచి తొలగించారు ఈ పథకం కింద ఏడాదికి సగటున 100 పని దినాలు కల్పించవలసి ఉండగా వాటి సంఖ్య 51కి తగ్గిపోయింది. ఈ సామాజిక భద్రతా పథకం నిధుల కొరతతో నీరుకారిపోతోంది.

ప్రస్తుత ప్రభుత్వం ఒక్కొక్కరికి 5 కిలోలు చొప్పున, 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేస్తోంది. ఈ ఉదారతకు అర్హులైన పౌరులు ఇంకా పది కోట్ల మంది ఉన్నారు. ఉచిత రేషన్లు, మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉన్నప్పటికీ కోట్లాది మంది బాలలకు పోషకాహారం లభించడం లేదు. దేశంలోని మొత్తం బాలల్లో 35.5 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సూచీ పరిగణనలోకి తీసుకున్న 127 దేశాలలో భారత్ 105వ స్థానంలో ఉన్నది! దేశ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అవుతున్న వస్తువుల, సేవల మొత్తం విలువలో తయారీరంగం వాటా 2011%–%12లో 17.4 శాతం నుంచి 2024%–%25లో 13.9 శాతానికి తగ్గిపోయింది. ఉత్పత్తితో ముడిపెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్న పథకం సత్ఫలితాలను సాధించడంలో ఘోరంగా విఫలమయింది. 14 రంగాలకు రూ.1,96,409 కోట్లు కేటాయించినా కేవలం రూ.14,020 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు.

## భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా

# 8.58లక్షల దరఖాస్తులు

మొదటి పేజీ తరువాయి

ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# రాష్ట్రంలో

## అప్రకటిత ఎమర్జెన్సీ

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్టు చాలా దారుణమని మండి పడ్డారు. ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. విదేశాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. మనోజ్ రెడ్డి అనే వ్యాపారిని బెదిరించిన కేసులో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని వరంగల్ సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం వరంగల్‌కి తరలించారు. ఎమ్మెల్యే తరచూ బెరదింపులకు దిగుతున్నాడని, రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నారని మనోజ్‌రెడ్డి భార్య కట్టా ఉమాదేవి హనుమకొండ సుబేదారి పోలీసులకు ఏప్రిల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 308(2), 308(4), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా

# ఫోన్‌ట్యాపింగ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పింది తానేనన్నారు. "హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్ జరిగింది. ప్రభాకర్‌రావు చాలా మంది జీవితాలను నాశనం చేశారు. భారాస నేతలు, వారి భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే రాధాకిషన్ చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ఫోన్ ట్యాపింగ్‌కు వారే కారణం.

సీఎంవోను అడ్డాగా చేసుకుని ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం మర్యాదలు చేయడం ఆపాలి. పేపర్ లీక్ కేసులో ఆయన ఆదేశాలతోనే నన్ను అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్‌రావు అండ్ కోను కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చేముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు? నాకు సిట్ అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వారు వచ్చి విచారిస్తామన్నారు" అని బండి సంజయ్ తెలిపారు.

## ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. "మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి" అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు..

## బేడీల రాజ్యం: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

జిన్నారం: కేసీఆర్ పాలనలో అందరికీ రైతుబంధు వచ్చిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న చాలా ఎకరాలకు రైతుభరోసా రాలేదని తెలిపారు. కేసీఆర్ పెట్టిన పథకాలకు కోతలు పెట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో భారాస ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతు భరోసా రాని రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు రైతుభరోసా నిధులు సీఎం ఇవ్వలేదని చెప్పారు. కరోనా వచ్చినా భారాస హయాంలో రైతుబంధు ఇచ్చారని పేర్కొన్నారు. రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది రైతు రాజ్యం కాదు.. బేడీల రాజ్యమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్‌రెడ్డి తనపై కేసు పెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ పడిపోయిందని వ్యాఖ్యానించారు.

## ఎన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డికి

## తలవంచం : పాడి కౌశిక్

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా తలవంచబోమని, నిలదీస్తూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టంచేశారు. రేవంత్ రెడ్డి బినామీల ద్వారా నడిపిస్తున్న క్వారీ పనులను ప్రశ్నించినందుకే తనను అరెస్ట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. శనివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేస్తున్న సందర్భంగా కౌశిక్ రెడ్డి ఈ కామెంట్స్ చేశారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఎయిర్‌పోర్టులోనే తనను అరెస్టు చేయడం అక్రమమని కౌశిక్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా నిజాయితీ తలవంచదని అన్నారు. శంషాబాద్‌లో తనను అరెస్ట్ చేసిన తీరు ప్రజాస్వామ్యంపై దాడికి సమానమని వ్యాఖ్యానించారు.

'రేవంత్ రెడ్డి గారూ.. మీ కుట్రలు, అక్రమ కేసులతో నన్ను ఆపాలని అనుకోవడం మీ మూర?త్వాన్ని, మీ అసమర్థ పాలనను, అక్రమ రాజకీయాలను చాటుతోంది. ముమ్మాటికి తాను ప్రస్తావిస్తున్న క్వారీ సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంతోపాటు మంత్రి సీతక్క బినామీలది. దానివల్ల ప్రజలకు తీవ్రమైన ఇబ్బంది కలుగుతున్నది. వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. ఇచ్చిన భూమి పరిధి దాటి అక్రమంగా వారిని నడుపుతూ ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. ఆ ప్రాంత ప్రజల కోసం ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటా' అని పాడి స్పష్టంచేశారు.

## 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు

# విదేశీ విద్య

మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఇక నుంచి ఏడాదికి 500 మందికి అవకాశం కల్పించనున్నారు. అందుకు సంబంధించిన ఫైలుపై తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, గిరిజన అభివృద్ధి, దివ్యాంగుల, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ తొలి సంతకం చేశారు. సచివాలయంలో 2వ అంతస్తులోని తన చాంబర్‌లో మంత్రిగా శనివారం ఉదయం ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 844 మంది దివ్యాంగులకు రూ.5 కోట్లతో స్వయం ఉపాధి కల్పించే యూనిట్ల మంజూరు, అదేవిధంగా దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి తద్వారా 2367 మందికి 3.50 కోట్లను పంపిణీ చేసే ఫైలుపై సంతకం చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు ఏటా 210 మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నతవిద్యా అభ్యాసానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యను 500 లకు పెంచారు. అందుకు సంబంధించిన ఫైలుపై కూడా మంత్రి సంతకం చేశారు. అదేవిధంగా మేడారం జాతరలో ఏర్పాట్లకు సంబంధించిన రూ.45 కోట్ల పనులకు, రూ.79.61 కోట్లతో గిరిజన విద్యాలయాల మరమ్మతు పనులకు, మినీ గురుకులాల నిర్వహణకు 17.18 కోట్లను, అదేవిధంగా ఐఐటీ, నీట్‌లో ర్యాంకులను సాధించిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం తెలిపారు. అనుమతులు మంజూరు చేశారు. బాధ్యతలను స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, సంజయ్‌కుమార్, ధర్మపురి నియోజకవర్గ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

## దేశంలో తెలంగాణలోనే

## స్టార్టప్ విజయవంతమైంది



మొదటి పేజీ తరువాయి

ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెటప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశాము. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ–హబ్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. ఐటీ రంగ ఉద్యోగ కల్పనల్లో వరుసగా రెండు సంవత్సరాల పాటు బెంగళూరుని హైదరాబాద్ దాటింది అని కేటీఆర్ గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో మేము తెలంగాణ రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. ఒకవేళ 15 రోజుల్లో లోపు అనుమతులు రాకపోతే ఆ పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి అవకాశం లేదు అని కేటీఆర్ తెలిపారు. వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము. భారతదేశంలోని 65 శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే మేము వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాము. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు రూ. 75 వేల కోట్లు జమచేసిన రాష్ట్రం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. అందుకే 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హర్యానా దాటి 2022 నాటికి నంబర్ వన్‌కు చేరింది అని కేటీఆర్ తెలిపారు. బటర్ ఫ్లై ఎఫెక్ట్ గురించి చెప్పుకున్నట్టే కేసీఆర్ ఎఫెక్ట్ గురించి కూడా చెప్పుకోవాలి. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుంది అనడానికి తెలంగాణ విజయగాథనే నిదర్శనం. కోటి ఇండ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒకటి. 80 మీటర్ల సముద్ర మట్టం నుంచి 618 మీటర్లకు నీటిని తీసుకెళ్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో తెలంగాణ నెంబర్ వన్. పారిశ్రామిక అవసరాల కోసం తగినంత నీటిని అందుబాటులో ఉంచిన రాష్ట్రం తెలంగాణ. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్ పూర్తిగా నిర్మూలించబడింది. హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చాను. మనం కలిసి అద్భుతాలు చేయవచ్చు. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

బూర్గంపాడు ఘటన అనుమానుషం

బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళలపై దాడి అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. బూర్గంపాడు ఘటన సీఎం ఆలోచనలకు అద్దం పడుతోందన్నారు. సీఎంగా అలాంటి వ్యక్తి ఉంటే రాజ్యాంగం ఎక్కడ అమలవుతుంది..? దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చే హామీ ఇదేనా..? దేశ మహిళలకు ప్రియాంకా గాంధీ ఇదే గౌరవం కోరుకుంటున్నారా..? మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతున్న సమానత్వం ఇదేనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో
# విప్లవాత్మక విజయం – లెనకాపవిర్ ఔషధం

**– స్పెషల్ ఆర్టికల్**

**-రామ్ సంకుల రీసర్చ్ అనలిస్ట్**
**అశ్వారావు పేట,ఖమ్మం**

అమెరికాలో 1981లో ఎయిడ్స్ కేసులు మొదటగా నమోదు అయినపుడు అది అంత ప్రమాదకరమైన వ్యాధి అనేది పెద్దగా ఎవరికీ తెలీదు.

**– దానికి కారణం అయిన హెచ్ఐవి వైరస్ ని 1983లో కనుగొన్న తరువాత ప్రపంచం అంతా ఒక్కసారి ఉలిక్కి పడింది**

అప్పటి నుంచి హెచ్ఐవి మీద ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు వైరస్ ను చంపే మందు ఒక్కటి కూడా కనుగొనబడలేదు. వైరస్ ఒక్కసారి శరీరం లోకి ప్రవేశించింది అంటే దాన్ని చంపడం లేదా బయటికి పంపడం ఏ మందు వల్ల కూడా అవదు.ఎలాంటి వ్యాధికారక జీవులనైనా ఎదుర్కోవడానికి మనిషికి వ్యాధినిరోధక శక్తి ఉంటుంది.దానికి కారణం సిడి-4 కణాలు. ఇవి శరీరంలోకి ప్రవేశించే హానికర జీవుల్ని అంతం చేస్తాయి. హెచ్ఐవి మనిషి యొక్క వ్యాధి నిరోధక శక్తి ని దెబ్బ తీస్తుంది. ముఖ్యంగా సిడి-4 కణాలను నిర్వీర్యం చేస్తుంది.

**– అందువల్ల హెచ్ఐవి సోకిన వ్యక్తుల్లో ఇతర వ్యాధులు పెరిగే అవకాశం ఎక్కువ.**
**అవి ఎక్కువ అయ్యి సిడి-4 కణాలు సంఖ్య తగ్గితే వ్యక్తి ఎయిడ్స్ స్థాయికి వెళ్ళినట్టే**

ఇప్పటి వరకు హెచ్ఐవి కి కానీ ఎయిడ్స్ కి కానీ చికిత్స లేదు. కేవలం వైరస్ సోకకుండా జాగ్రత్తగా ఉండటం తప్ప. ఒకవేళ సోకితే, వైరస్ సంఖ్య పెరగ కుండ చేసే ఔషదాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.అందుకే హెచ్ఐవి విషయంలో




అవగాహన ఒక ఔషదం మరియు నిర్లక్ష్యం ఒక ప్రమాదం అని చెప్పవచ్చు.

**– అమెరికా లోని ఔషద నియంత్రణ సంస్థ హెచ్ఐవి ని నివారించడానికి లెనకాపవిర్ అనే కొత్త ఔషదాన్ని "ఎజ్టుగో" పేరుతో ఆమోదించింది**

ఈ ఔషధం ఇంతకు ముందే ఆమోదం పొందినప్పటికీ అది కొంతమందికే పని చేస్తుంది. కానీ ఎజ్టుగో మందు హెచ్ఐవి రావడానికి అవకాశం ఉన్న వ్యక్తుల్లో సమర్ధవంతంగా వైరస్ రాకుండా అడ్డుకుంటుంది.2024లో సైన్స్ జర్నల్ ఈ ఔషదాన్ని 2024 సంవత్సరం యొక్క గొప్ప ఆవిష్కరణగా గుర్తించింది. ఈ ఔషదం యొక్క తయారీకి దాదాపుగా 20 సంవత్సరాలు పట్టింది.

**– అయిదు శతాబ్దాల పరిశోధనలలో ఏ సంస్థ సాధించని ఘనత గిలియడ్ సంస్థ సాధించింది**

ఈ సంస్థ రూపొందించిన ఎజ్టుగో హెచ్ఐవి టైపు-1 కాప్సిడ్ నిరోధకం తరగతికి చెందిన యాంటీ రెట్రోవైరల్ డ్రగ్. ఈ సంస్థ ఈ ఔషధ పరీక్ష కోసం చేపట్టిన పర్పస్-1 మరియు పర్పస్-2 అనే రెండు క్లినికల్ ట్రయల్స్ అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయి. పర్పస్-1 ట్రయల్ లో, 2134 మంది కొండోమ్ లేకుండా శృంగారం జరిపే ఆఫ్రికన్ మహిళలకు లెనకాపవిర్ ఇంజెక్షన్ ను చర్మం కింద (సబ్క్యూటేనియస్ ఇంజెక్షన్) నుంచి ప్రతీ ఆరు నెలలకు ఒక్కసారి ఇవ్వగా ఒక్కరికి కూడా హెచ్ఐవి సోకలేదు.అంటే 100 శాతం హెచ్ఐవి నివారణ జరిగిందని నిర్ధారణ అయ్యింది. పర్పస్-2 ట్రయల్ లో, 2179 మంది కొండోమ్ లేకుండా శృంగారం జరిపే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలు, పురుషులు మరియు లింగ మార్పిడి జరిగిన మహిళలు, పురుషుల్లో కేవలం ఇద్దరికీ మాత్రమే హెచ్ఐవి సోకింది.అంటే దాదాపు 99.9 శాతం నివారణ జరిగిందని నిర్ధారణ అయ్యింది. స్వతహాగా ఉన్న ఔషద నిరోధక శక్తి చేత హెచ్ఐవి వైరస్ అన్ని ఔషదాలను తట్టుకుంటుంది.లెనకాపవిర్ అలా కాదు. అన్ని ఇతర ఔషదాల్లాగా ఒక్క దశలో కాకుండా వైరస్ యొక్క జీవిత చక్రంలో ఉన్న అన్ని దశలలోను వైరస్ ను అడ్డుకుంటుంది. అందుచేత లెనకాపవిర్ ని నిరోధించే శక్తి వైరస్ కి ఉండదు. ప్రస్తుతం దీనిని తయారు చెయ్యడానికి చాలా ఖర్చు అవుతుంది. గిలియడ్ సంస్థ లెనకాపవిర్ ధర 28218 డాలర్లుగా ప్రకటించింది. భారత కరెన్సీలో 25 లక్షల రూపాయలకు సమానం.ఒక మనిషికి ఒక సంవత్సరానికి రెండు డోసులకు కలిపి ఈ ధర. అధిక ధర కారణంగా ప్రతీ ఒక్కరికీ దీన్ని కొనే స్థాయి ఉండక పోవచ్చు. కొంతమంది ప్రముఖులు లెనకాపవిర్ జెనెరిక్ ధర 40 డాలర్లుగా ఉండవచ్చని, అది ఇంకో అయిదు సంవత్సరాలలో పెరిగే అవసరం దృష్ట్యా ధర ఇంకా తగ్గి 25 డాలర్లు వరకు అవ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంటే కేవలం 4300 రూపాయల నుండి 2200 రూపాయల ధరకు లభించే అవకాశమున్నది.అంతే కాదు హెచ్ఐవి మరియు ఎయిడ్స్ నివారణ కోసం పని చేసే ఐక్యరాజ్య సమితి కూడా ఈ ఔషదం ధరను తగ్గించమని "గిలియడ్" సంస్థకు మనవి చేసింది.
వీటి అన్నిటిని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ వచ్చే నెల, అనగా జులై 2025లో ఈ ఔషదం గురించి కొన్ని మార్గదర్శకాలను విడుదల చేయబోతున్నది.అభినందించ దగ్గ విషయం ఏమిటంటే గిలియడ్ సంస్థ 120 దేశాలలో ఉచిత




లైసెన్సుతో "జెనెరిక్ ఔషదం"గా ఇవ్వడానికి ఒప్పుకుంది. ఏ సంస్థ కూడా ఉచితంగా లైసెన్సు ఇవ్వదు. గిలియడ్ సంస్థ కూడా ఉచితంగా లైసెన్స్ ఇవ్వకపోతే లెక్క లేనంత డబ్బు సంపాదిస్తుంది. కానీ అది అలా చేయట్లేదు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరికీ ఈ ఔషదం లభించే వీలుంది. ఇప్పటి వరకు ఈ ఔషదం అమెరికాలో మాత్రమే ఆమోదం పొందింది. ఇతర దేశాలలో కూడా ఆమోదం పొందితే చాలా మంది, ముఖ్యంగా చిన్న పిల్లలు తల్లి దండ్రుల నుంచి సంక్రమించే హెచ్ఐవి బారిన పడకుండా సురక్షితంగా ఉండడానికి అవకాశం ఉంది. హెచ్.ఐ.వి సోకకుండా ఈ ఇనెక్షన్ కాపాడుతుందని విశ్వాసం కలిగింది.

**– మరి ఇప్పటికే ఈ హెచ్.ఐ.వి సోకిన వారికి ఉపశనం కలిగిస్తుందా లేదా అనేది పరిశోధకులు,డాక్టర్లు చెబుతారు**

హెచ్.ఐ.వి బారిన పడి బాధ పడుతున్న వారికి ఈ వ్యాధి తగ్గిపోతే మానవ జాతికి మహోపకారం జరిగినట్టే భావించాలి.వైద్య శాస్త్ర విజ్ఞానులు,పరిశోధకులు త్వరలోనే ఈ దశను కూడా చేరుకుని, హెచ్.ఐ.వి ఎయిడ్స్ నుండి ప్రజలను రక్షిస్తారని నమ్మవచ్చు.

# మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా
# రైతు బంధువులకు కరువైన భరోసా

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

**– మేడ్చల్ మల్కాజిగిరి రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ ఎందుకు?**
**– మున్సిపల్ పరిధిలో రైతులు లేరా?**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రైతు భరోసా పథకం ద్వారా కటాకట్ అంటూ ప్రతి ఒక్క రైతుకు వారి వారి ఖాతాల్లో 6 వేల రూపాయల చొప్పున రైతు భరోసా డబ్బులు జమ అవుతున్నాయి. కేవలం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రైతుల పట్ల రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపెడుతున్నదని డబిల్ పూర్ పిఏసిఎస్ చైర్మన్ శ్రీ సద్ది సురేష్ రెడ్డి అన్నారు.

**– మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హైదరాబాద్ మహానగరానికి దగ్గరలో ఉన్న పుష్కలమైన పంట పండింది**

జిల్లాలో ఉన్న 11 మండలాల్లో ఆరు గ్రామీణ మండలాలు, 5 పట్టణ మండలాలు ఉన్నాయి.




**– జిల్లాలో మొత్తం 45, 067 ఎకరాల్లో సాగు జరిగింది. మొత్తం 49727 మంది రైతులు వివిధ రకాల పంట సాగు చేయడం వల్ల లెక్కలేనంత దిగుబడి వచ్చింది**

జిల్లాలోని మేడ్చల్, షామీర్ పేట, కీసర, కుత్బుల్లాపూర్, డిండిగల్, ఆల్వాల్, ఘట్కేసర్ మండలాల్లోని రైతులకు ఒక్క పైసా కూడా దక్కలేదు.
ఈ మండలాల్లోని ఏ ఒక్క రైతుకు కూడా రైతు భరోసా డబ్బులు రాలేదు.

**– కానీ ఒక్క మూడు చింతలపల్లి మండలాల్లోని కొందరు అదృష్టవంతులైన రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు అందినాయి**

జిల్లాలోని మూడు చింతలపల్లి మండలంలో కొందరు రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చి మిగతా మండలాల్లోని రైతులకు డబ్బులు ఇవ్వకపోవడానికి కారణమేమిటి?

**– మేడ్చల్ మర్కాజిగిరి జిల్లాలోని రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వకూడదనుకుంటే ఏ ఒక్కరికి ఇవ్వకూడదు. మరి మూడు చింతలపల్లి మండల రైతులకు ఇచ్చినప్పుడు అందరికీ ఇవ్వాలి**

ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలోని రైతులకు రైతు భరోసా డబ్బులు రావని అధికారులు చెప్పినట్లుగా ఒక వార్త ప్రచారం జరుగుతున్నది.ఇది ప్రభుత్వ అభిప్రాయమా? లేక రాజకీయ లాభాలు ఈ ప్రాంతంలో తమకు లభించవనే కక్ష నా? అని సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఉన్న అన్ని క్లస్టర్ల నుంచి లెక్కలేనన్ని లారీలతో ధాన్యాన్ని సేకరించిన ప్రభుత్వం కనీసం ఆయా రైతుల కన్నా రైతు భరోసా నిధులు ఎందుకు ఇవ్వడం లేదు**
**అని సురేష్ రెడ్డి ఆరోపించారు**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రైతులే లేరు అనుకుంటే ప్రభుత్వం సేకరించిన ధాన్యం ఎక్కడి నుంచి వచ్చింది?

**– రైతులందరికీ రైతు భరోసా నిధులు ఇవ్వాల్సిందే**

గ్రామాల్లో ఉన్న పట్టణాలకు దగ్గరలో ఉన్న రైతు రైతే. రైతులందరికీ శ్రమ ఒక్కటే. ఈ రైతులందరి హక్కులు కూడా ఒక్కటే. ఇది రైతు రాజ్యమని చెప్పుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రైతుల పట్ల వివక్ష చూపడం భావ్యం కాదని శ్రీ సురేష్ రెడ్డి గారు అన్నారు. రైతుకు ఏ పార్టీ లేదు. రైతు పండించే పంట ఏ ఒక్కరికి చెందదు. రైతు కష్టం ప్రజల కొరకే. రైతు పండించే పంట అందరికీ కడుపు నింపడానికే. అటువంటి రైతుల ను గ్రామాల వారీగా పట్టణాల వారీగా విభజించి చూడడము భావ్యం కాదని శ్రీ సురేష్ రెడ్డి గారు అన్నారు. పక్క జిల్లాలకు రైతు భరోసా నిధులు అందించి, కేవలం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రైతులకు మొండి చేయి చూపడం సరికాదని శ్రీ సద్ది సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

## హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టులో మరో ముందడుగు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్:**
హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వం మెట్రో రైలు దశ 2 (బి) ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. మెట్రో రైల్ ఫేజ్ 2 (బి) ప్రతిపాదనతో పాటు అవసరమైన అన్ని పత్రాలు, డీపీఆర్‌లను ఇవాళ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. వారం క్రితం రెండో దశ మెట్రో ప్రాజెక్టుకు తెలంగాణ సర్కార్.. పరిపాలన అనుమతులు ఇచ్చింది.మెట్రో రెండో దశ (బి) లో 86.1 కిలోమీటర్లు. 19,579 కోట్ల రూపాయలతో మెట్రో రెండో దశ నిర్మాణం జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యం తో మెట్రో రెండో దశ నిర్మాణం జరగనుంది. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టులో 3 కారిడార్లు ఉన్నాయి. అందులో ఆర్‌జీఐఏ నుండి భారత్ ఫ్యూచర్ సిటీ (39.6 కిమీబీ రూ.7,168 కోట్లు), జేబీఎస్ నుంచి మేడ్చల్ (24.5 కిమీబీ రూ. 6,946 కోట్లు), జేబీఎస్ నుంచి షామిర్‌పేట (22 కిమీబీ రూ. 5,465 కోట్లు). మొత్తం 86.1 కిమీ పొడవును కవర్ చేసే ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్టులో మొత్తం రూ. 19,579 కోట్ల పెట్టుబడి ఉంటుంది.గతంలో సమర్పించిన ఫ్లేజ్ 2 (ఎ) ప్రాజెక్ట్ ఐదు



కారిడార్ల (76.4 కి.మీ) లాగానే, ఈ ఫేజ్ 2 (బి) ప్రాజెక్ట్‌ను కూడా కేంద్ర, రాష్ట ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వ JV ప్రాజెక్ట్ నిబంధనల ప్రకారం, ఫేజ్ 2 (బి) ఖర్చు రూ.19,579 కోట్లు. తెలంగాణ ప్రభుత్వ వాటా రూ. 5,874 కోట్లు (30 శాతం), భారత ప్రభుత్వం వాటా రూ. 3,524 కోట్లు (18 శాతం), అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణం రూ. 9,398 కోట్లు (48 శాతం), చిన్న పీపీపీ భాగం రూ. 783 కోట్లు (4 శాతం) కలిగి ఉంటుంది.

## హైదరాబాద్ లో ముగ్గురు బైక్ దొంగలు అరెస్ట్..13బైకులు స్వాధీనం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్:**
హైదరాబాద్ లో బైక్ దొంగలు రెచ్చిపోతున్నారు. నగరంలోని పలు చోట్లు పార్కింగ్ చేసిన బైకులను చోరీచేసి వచ్చిన డబ్బుతో ఎంజాయ్ చేస్తున్నారు. శనివారం(జూన్ 21) బంజారా హిల్స్ పోలీసులు ముగ్గురు బైకు దొంగలను అరెస్టు చేశారు. వారి నుండి చోరీకి గురైన పదమూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.నిమ్మతి శ్రీకాంత్ (32), నవీన్ (22) వివిధ సినిమా షూటింగ్‌లలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. నగరంలోని ప్రాంతాల్లో ఇద్దరూ నిరంతరం బైక్‌లను చోరీ చేస్తున్నారు. మూడవ నిందితుడు షేక్ కలీమ్‌కు ఈ బైకులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.శ్రీకాంత్ అనే నిందితుడు 2020 నాటి నుంచి పదే పదే బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని పోలీసులు చెప్పారు. హైదరాబాద్ సిటీలోని వివిధ పోలీస్ స్టేషన్లలో శ్రీకాంత్ పై ఇప్పటికే ఐదు కేసులున్నాయి. చోరీకి గురైన బైక్‌లపై బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, గోపాలపురం, బోరబండ, మేడ్చల్, పేట్ బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

## విశ్వ భారతి విద్యాసంస్థల్లో యోగాడే కార్యక్రమాలు...




**పెద్దపల్లి జిల్లా జూన్ 21 కరపత్రం ప్రతినిధి**
అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని విశ్వభారతి ,నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో శనివారం యోగ నిర్వహకుల ఆధ్వర్యంలో యోగ డే కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.అందరు విద్యార్థుల చేత యోగ ఆసనాలు , సూర్య నమస్కారాలు బ్రీతింగ్ ఎక్సర్సైజులు చేయించి యోగా యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి హైస్కూల్లో వికాస తరంగిణి సభ్యుల ఆధ్వర్యంలో , సెయింట్ జోసెఫ్ నవోదయ లో కుసుమ యోగ మాస్టర్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు జరిగాయి . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతు.... యోగ మానసిక శారీరక పరిస్థితులను సమత్వం చేస్తుందని , యోగాకు భారతదేశం పుట్టిన ఇల్లు అని, వేల సంవత్సరాల నుండి భారత దేశంలో ఋషులు మునులు యోగ ద్వారా జానాన్ని సంపాదించి పంచారని తెలిపారు.ఇంకా ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ నోయల్ జోసెఫ్, తిరుపతి గౌడ్ ,ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ ,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ రామగుండంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఎన్టీపీసీ రామగుండం అంబేద్కర్ పార్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత, డీఎంఎస్ అధ్యక్షురాలు రాఖీ సమంత నేతృత్వంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రముఖులందరూ దీపం వెలిగించడం ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సభను ఉద్దేశించి సమంత మాట్లాడుతూ పట్టణ నివాసితులందరూ యోగాను తమ దినచర్యలలో చేర్చుకోవాలని, దాని అభ్యాసాన్ని కేవలం వార్షిక వేడుకలకు పరిమితం చేయవద్దని ప్రోత్సహించారు. శరీరం, మనస్సు రెండింటినీ శుద్ధి చేయడంలో యోగా ప్రాముఖ్యతను తెలిపారు. జూన్ 14 నుండి 20 వరకు ఉద్యోగుల కోసం 7 రోజుల యోగా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న పిల్లలు తాము నేర్చుకున్న యోగా భంగిమలను కూడా ప్రదర్శించారు. ఈ వేడుకలో జిఎంలు, హెచ్‌ఓడీలు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డీఎంఎస్ సీనియర్ సభ్యులు, యూనియన్లు, సంఘాల ప్రతినిధులు సహా 200 మందికి పైగా వ్యక్తులు పాల్గొన్నారు.

## యోగాసనాలు మానసిక ఏకాగ్రతను పెంపొందిస్తాయి

**- జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి**



కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి




యోగాసనాలు ,ప్రాణాయామం, ధ్యానం శారీరకస్థైర్యం , మానసిక ఏకాగ్రతను పెంపొందిస్తాయని సంగారెడ్డి జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి తెలియజేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని జడ్పీహెచ్ఎస్ శివంపేట పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం మెరుగు కోసం ప్రతి రోజు యోగను అభ్యసించాలన్నారు. యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనశైలి సానుకూలమైన దృక్పాదం కలుగుతుందని సూచించారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వేదశ్రీ, షి టీం సంతోషి, జిఎస్ విశాల, ఎస్ హెచ్ ఓ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయుధంతో అస్తమించిన సాయుధ వీరుడు

**- కామ్రేడ్ గాజర్ల రవి మరణం గౌరవనీయమైనదే**
**- కానీ ఆ మరణం ఆదర్శమా కాదా అని విజ్ఞులు చెప్పాలి**




**కరపత్రం జనరల్ డెస్క్ ..**
మావోయిస్ట్ అభిమానుల బహిరంగ ప్రెస్ నోట్ ఆధారంగా ఈ వార్త ప్రచురణకు తీసుకోబడింది.మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు AOB కార్యదర్శి కామ్రేడ్ గాజర్ల రవి ఉరఫ్ ఉదయ్ కి వేలాది మంది ప్రజలు ప్రజాస్వామిక వాదుల వెల్చాల గ్రామంలో నిన్న అంతిమయాత్ర జరిగింది.మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మరియు AOB కార్యదర్శి కామ్రేడ్ గాజర్ల రవి ఉరఫ్ ఉదయ్ ఉరఫ్ గణేష్, SZC మెంబర్ కామ్రేడ్ అరుణ మరియు మావోయిస్ట్ నాయకి అంజూ మొన్న 17 జూన్ 2025 న గ్రే హౌండ్స్ పోలీసుల తో జరిగిన ఎన్కౌంటర్ లో అసువులు బాసిన విషయం తెలిసిందే.. కగార్ఆపరేషన్ లో భాగంగా ఈ ఎన్కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ఆరోపించింది.ఎన్కౌంటర్ లో మరణించిన ఈ మావోయిస్టుల భౌతిక కాయలను, కుటుంబ సభ్యులు నిన్న రాత్రి పోస్ట్ మార్టం అనంతరం రంపచోడవరం నుండి నిన్న అనగా 20 జూన్ 2025,శుక్రవారం, ఉదయం 9 గంటలకు స్వగ్రామం వెల్చాల కు తీసుకవచ్చారు.గాజర్ల రవి మృత దేహానికి ఉదయం 9 గంటల నుండి వెల్చాల గ్రామంలో బంధువులు,స్నేహితులు నివాళులు అర్పించారు. బంధువులు స్నేహితులతో పాటు అమరుల బంధు మిత్రుల సంఘం, విరసం,ప్రజాస్వామిక వాదులు,పౌర హక్కుల సంఘం నాయకులు,తెలంగాణ ప్రజా ఫ్రంట్,ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు,BC సంఘాలు, గౌడ సంఘాలు, భూపాలపల్లి MLA గండ్ర సత్యనారాయణ రావు,,MLC లు సిరికొండ మధుసూదనాచారి,తీన్మార్ మల్లన్న, పూర్వ విప్లవోద్యమ నాయకులు,కాంగ్రేస్, BRS, CPI, CPM, CPI ML న్యూడెమోక్రసీ, CPI ML చంద్రన్న వర్గం, ఇతర రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు.నిన్న మధ్యహ్నం 1-45 కు ప్రారంభమైన అంతిమయాత్ర గ్రామస్తుల నివాళులతో కొనసాగి సాయంత్రం 5 గంటలకు ముగిసింది...సాయుధ పోరుతో ప్రారంభమైన గాజర్ల రవి జీవితం ఆయుధం తోనే ముగిసింది.గాజర్ల రవి గారు అంకిత భావంతో తను నమ్మిన సిద్ధాంతం కొరకు పనిచేసాడు. తన సిద్ధాంత ఆశయ సాధన కొరకు జీవితాన్ని అంకితం చేశాడు.రవి గారి మాదిరిగా ఎందరో తమ జీవితాల్ని త్యాగం చేసారు.

**- సిద్ధాంతం ఏదైనా మరణం గౌరవనీయమైనదే..**
**- కానీ ఆ మరణాలు ఆదర్శమా? కాదా? అని కాలం చెబుతుంది**

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మించిన పౌర సమాజ వ్యవస్థ ఇంకొకటి లేదు.మన దేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అత్యుత్తమ మైనది.భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం నీడలోనే ప్రతి ఆకాంక్ష నెరవేరుతుంది.మావోయిస్టులు కూడా తమ సాయుధ పోరు విరమించి ఈ అకాల మరణాలు,మారణ కాండకు ముగింపు పలకాలని ప్రతి భారతీయుడు కోరుకుంటున్నాడు.మేధావులు కూడా దేశంలో అంతర్గత సాయుధ పోరు సాగకూడదని పిలుపిస్తుని న్నారు.మావోయిస్టులు కూడా మన భారత రాజ్యాంగం నీడలో తమ ఆశయ సాధనకు పాటుపడాలని సామాన్యులు కూడా కోరుకుంటున్నారు.

**- భారత రాజ్యాంగం వర్ధిల్లాలి**

## సైనిక్‌పురిలో రాణ్వీర్ తైక్వాండో అకాడమీలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**- యోగా మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం**






అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సైనిక్‌పురిలోని GBR స్పోర్ట్స్ సెంటర్ ఆవరణలో ఉన్న రాణ్వీర్ తైక్వాండో అకాడమీలో ఘనంగా యోగా వేడుకలు జరిగాయి. యోగా మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తైక్వాండో విద్యార్థులతో పాటు సీనియర్ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలను అభ్యసించారు.ఈ సందర్భంగా మాస్టర్ రమేష్ యోగా వల్ల కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. “యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, ఇది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే సంపూర్ణ సాధనం” అని ఆయన అన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని ఆయన నొక్కి చెప్పారు. అంతేకాకుండా, శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా, విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచి చదువులో మెరుగైన ఫలితాలు సాధించడానికి యోగా ఎంతగానో సహాయపడుతుందని మాస్టర్ రమేష్ పేర్కొన్నారు. అలాగే, తల్లిదండ్రులు కూడా యోగా సాధన చేయడం ద్వారా నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా జీవించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా వివిధ యోగాసనాలు, ప్రాణాయామ పద్ధతులను అభ్యసించారు. ఈ కార్యక్రమం యోగా పట్ల అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి స్ఫూర్తినిచ్చిందని నిర్వాహకులు తెలిపారు. రాణ్వీర్ తైక్వాండో అకాడమీ కేవలం తైక్వాండో శిక్షణనే కాకుండా, విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తుండటం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# లక్ష్మీనగర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం..

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**







అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా లక్ష్మీనగర్ మండలం దుర్గానగర్‌లోని ఆర్కే గార్డెన్స్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు చేస్తూ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... “యోగ మన సంస్కృతిలో భాగం అన్నారు...శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ దీన్ని నిత్యం ఆచరించాలి” అని పేర్కొన్నారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పలువురు యోగ శిక్షకులు వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు నేర్పించడం జరిగింది....మహిళలు, యువత, వృద్ధులు పెద్దఎత్తున పాల్గొని ఉత్సాహంగా యోగ సాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను కందుల సంధ్యారాణి అభినందించారు.ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సరోత్తం రెడ్డి, హారిక , లక్ష్మీనగర్ మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి,పిడుగు కృష్ణ,కోడూరి రమేష్,జక్కన బాలు,సిలారపు కళ్యాణ్,బుంగ మహేష్,దాసరి సుమలత,అంజలి,లలిత,ప్రశాంతి,మంజుల తదితరులు పాల్గొన్నారు.